# మరో స్త్రీ!

- అర్చనా చౌహాన్

కలలు.

కననిదెవరు?

చిన్నారిపొన్నారి చిట్టిచిట్టి రంగురంగుల కలలు.

నేనూ కన్నాను. ఓ చిన్ని కల. అతి సామాన్యమైన కల. ప్రతి అమ్మాయి చూసే కల. పెళ్లి కల.నాకంటూ ఓ ఇల్లు, భర్త, పిల్లలు, నాదంటూ ఓ సంసారం. అంతే! ఎక్కువేమీ అడగలేదే?

నేను చాలా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తానంటారందరూ. నేనూ అదే అనుకుంటాను. ఆకాశ హర్మ్యాలు నిర్మించడం, గాలిలో మేడలు కట్టడం నాకు సుతరామూ నచ్చదు. అందుకే నేనుకన్న ఆ చిన్ని కల అతి సామాన్యంగా వుందనుకున్నాను. నా పరిధిలోనే అందుబాటులోనే వుందనుకున్నాను.

కానీ ఇప్పుడాలోచిస్తే అది ఎంత తప్పో తెలుస్తోంది. నేను నిజంగానే ఆకాశ హర్మ్యాలు నిర్మించాననిపిస్తుంది. ఆ నా చిన్ని కల ఎక్కడో తప్పిపోయింది. ఎప్పుడో నాకు తెలీకుండా మాయమైపోయింది. వేళ్లసందుల్లోంచి చల్లగా జారిపోయే ఇసుకలా గుట్టుచప్పుడు కాకుండా జారిపోయింది. జారి ముక్కలయిపోయింది. చెల్లాచెదురైపోయింది. నేనేమీ చేయలేకపోయాను. కేవలం ముక్కలయిన దాని రొద వింటుండిపోయాను.

అన్యోన్యంగా నవ్వుతూ తుళ్లుతూ ఎక్కడైనా జంటలు కన్పిస్తే మనసంతా బరువుగా అయిపోతుంది. ఈ మధ్యైతే పసిపిల్లల కిలకిలలు కూడా భరించలేకపోతున్నాను.

నాకే ఎందుకిలా జరగాలి? నేను ఏం పాపం చేసానని నాకీ శిక్ష?

ఆ రోజు నాకింకా గుర్తు.

నా పెళ్లి కుదిరిన రోజు.

మధురమైన ఊహలలో తేలుతూ ఎంత ఆనందంగా వున్నానో! అవునుమరి. అమర్‌లాంటి అందగాడు నాకు భర్తగా లభిస్తాడని నేను కలలోకూడా ఊహించలేదు.

నేను అదృష్టవంతురాలినని అందరూ పొగుడుతుంటే పొంగిపోయాను.

ఆరడుగుల ఎత్తు, పసిమిఛాయ, ఉంగరాల జుట్టు, ఆజానుబాహువు, అణువణువునా మగసిరి ఉట్టిపడుతున్న స్వరూపం... ఆ చురుకైన చూపు గిలింతలు పెట్టేసింది.

అబ్బాయి చాలా బుద్ధిమంతుడు. మితభాషి అని చెప్పారు. అంచేత అతను నాతో మాట్లాడడానికి ఎలాంటి ఆసక్తి కనబరచకపోయినా నేను పెద్దగా పట్టించుకోలేదు.

అసలు పట్టించుకునేంత తీరికెక్కడిది?

కాబోయే శ్రీవారి తలపులతో పులకించిపోయాను. అందమైన ఊహల మేడలను నిర్మించడమే సరిపోలేదు.

ఎన్నడూ కలల రాజకుమారుడి గురించి కలలు కనలేదనే నాకింతటి అదృష్టం వరించిందని పొంగిపోయాను.

పెళ్లిలో అంతా నన్ను ఆట పట్టిస్తుంటే సిగ్గుల మొగ్గలా కుంచించుకుపోయాను.

నా కలల హరివిల్లులోంచి మొట్టమొదటిసారిగా కట్టుకున్న ఊహల మేడమీంచి దబ్బున కిందపడ్డానికి ఎక్కువ సమయం పట్టలేదు. శోభనపు రాత్రే నా మానసిక పతనం ప్రారంభమైంది.

ఎన్నెన్నో తీపి కోరికలతో, ఆశలతో, గదిలోకి అడుగుపెట్టిన నేను సోఫాపై గాఢనిద్రలో వున్న వ్యక్తిని చూసి అవాక్కయ్యానంటే అతిశయోక్తికాదు.

నా చేతిలోని పాలగ్లాసుని జారనివ్వకుండా వణికే చేతులతో ఎలా పట్టి వుంచగలిగానో తెలీదు.

నా మనసు ఆనాడే కీడు శంకించింది.

కానీ సంబాళించుకున్నాను. నాకు నేర్పిన...నాలో అణువణువునా నింపిన సంస్కారాలు ఆ క్షణాన తోడ్పడ్డాయేమో!

పెళ్లి అలసటతో అతను సొమ్మసిల్లి నిద్రపోయి వుంటాడని సరిపుచ్చుకున్నాను. ఎంత పెళ్లి అలసట వున్నా శోభనపు రాత్రి వడ్డించిన విస్తరాకువంటి పడుచుపెళ్లాంతో కనీసం మాట కూడా మాట్లాడని మగాళ్లు వుంటారా అని ప్రశ్నిస్తున్న అంతరాత్మని నొక్కివేసాను.

ఇవాళ కాకపోతే రేపని సరిపెట్టుకున్నాను. ఎదురు చూసాను. నా కళ్లు కాయలు కాచాయేతప్ప నా నిరీక్షణ ఫలించలేదు.

రోజులు గడిచిపోయాయి. నెలలు కరిగిపోయాయి. ఎన్ని వెన్నెల రాత్రులు, చల్లని సాయంత్రాలు కన్నీళ్లే తోడుగా వెక్కిళ్లే జంటగా గడిపానో ఎలా లెక్క చెప్పను?

వంటరితనపు ముళ్లను పక్కపై పరచి అసహనంగా వాటిపై దొర్లిన క్షణాలను ఎలా జమకట్టను?

నన్ను పట్టుకోవడం మాట అటుంచి అమర్ నాతో నోరు విప్పి మాట్లాడితే ఒట్టు.

నాకర్థంకాలేదు.

అతనికేం కావాలో, అతని ఉద్దేశ్యమేమిటో తెలీలేదు.

అలాగని అతను నన్ను నిర్లక్ష్యం చేసాడని అనలేను. ఎందుకంటే ఒక వ్యక్తిని నిర్లక్ష్యం చేయాలంటే ముందుగా ఆ వ్యక్తిని నిర్లక్ష్యం చేసేంతగా పట్టించుకోవాలి. బహుశా అతను నన్ను నిర్లక్ష్యం చేస్తే కనీసం ఆ మేరకైనా నన్ను పట్టించుకున్నాడని సంతోషించేదాన్ని.

కానీ నాపట్ల అతని వ్యవహారం పూర్తి విముఖతతో నిండి వుంది. నా ఉనికే అతనికి తెలీనట్లుగా నాకంటూ ఒక వ్యక్తిత్వం లేనట్లుగా, అసలు నేనంటూ ఓ మనిషినే కానట్టుగా అక్కడికి నేను ఏదో ఫర్నిచర్లో భాగమైనట్లుగా... అదోలా!

అందుకే పెళ్లయి ఎన్ని నెలలు గడిచినా నా భర్త నాకో ఆగంతకుడిలా మిగిలిపోయాడు. ఆ ఆగంతకుడితో నా మనసులో మెదులుతున్న ప్రశ్నలను అడగలేకపోయానందుకే.

ఒక సందేహం మాత్రం నన్ను సర్వదా పీడిస్తూ వుండేది. బహుశా అమర్ మనసులో ఇంకెవరో వున్నారని.

మరో స్త్రీ!

అతను ఆమెను తన మనసులోంచి తీయలేకపోతున్నాడేమో! నాతో బలవంతంగా పెళ్లి చేసారేమో!

క్రమంగా నా అనుమానం బలపడసాగింది. నాకు తెలీని ఆ మరో స్త్రీపై అంతులేని ద్వేషాన్ని పెంచుకున్నాను.

ఇక భరించలేక ఒకరోజు మా అత్తగార్ని సూటిగా అడిగేసాను.

''అమర్ జీవితంలోఇంకెవరైనా ఉన్నారా?'' అంతే అన్నాను.

డొంక తిరుగుడులేదు.

ఆవిడ పెద్దగా ఆశ్చర్యపడలేదు. మా సంగతి ఆవిడ దృష్టిని దాటిపోలేదు. కాసేపు మౌనంగా వుండిపోయింది. నాకు సంగతెలా చెప్పాలా అని మాటలు, పదాలు భాష కూడబెట్టుకున్నట్లుంది.

ఆవిడ ఏ పదాలు వాడిందీ నాకు గుర్తులేదు. ఎలాంటి భాష వాడిందీ తెలీదు. కానీ విషయం విన్నాక నోరు తెరుచుకుని గుడ్లప్పగించి వినడంతప్ప ఇంకేమీ చేయలేకపోయాను ఆవిడ చెప్పిన సంగతే అలాంటిది.

ఇప్పుడా సంగతిని రిపీట్ చేయడానికి నాక్కూడా భాష, పదాలు, మాటలు వెదుక్కోవాల్సి వస్తోంది.

అమర్ జీవితంలో వేరే ఎవరో వున్నారన్న నా అనుమానం నిజమే. కానీ నేననుకున్నట్లుగా అతను మరో స్త్రీ కారణంగా నానుంచి దూరంగా లేడు. ఆవిడ (అమర్ తల్లి) కథనం ప్రకారం అమర్ మరో పురుషుడి వలలో చిక్కుకుపోయి వున్నాడు.

బాయ్ లవర్ అంటారే! అది. ఇంకా చెప్పాలంటే స్వలింగ సంపర్కం.

విషయం విన్నాక నేనెంత దిగ్భ్రాంతికి లోనయ్యానో మాటల్లో చెప్పలేను. సంగతి అర్థమయ్యాక నాలో కలిగిన భావ సంచలనాన్ని వ్యక్తపరచడం నాకు చాతకాదు.

జుగుప్స. అయోమయం. ఆశ్చర్యం, అసహ్యం.

ఇలాంటివాళ్ల గురించి వినడమే తప్ప నేను ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు. ఇలాంటి సంబంధాల గురించి స్పష్టంగా నాకేమీ తెలియదు. ఏదో ఎప్పుడో చదివాను. ఎవరో ఎక్కడో చెప్పగా విన్నానంతే.

నేను విన్నదాన్నిబట్టి చదివిందాన్నిబట్టి ఇలాంటి వాళ్ల గురించి నా మదిలో ఏర్పడిన ప్రతిరూపానికీ అమర్‌కీ ఎక్కడా పొంతనేలేదు. హోమోసెక్సువల్స్ అంటే సాధారణ మనుషులకి భిన్నంగా వుంటారనుకున్నాను. వాళ్ల హావభావాలు, వేషభాషలు, రూపురేఖలు ఏవో ఒకటి వాళ్లని పట్టిచ్చేస్తాయనుకున్నాను.

కానీ అమర్‌లా అతి సాధారణంగా అన్పించే వ్యక్తి. అంతటి అందగాడు, మగాడంటే ఇలా వుండాలని మగతనానికే నిర్వచనంలా వుండే అమర్.

మైగాడ్!

నేను నమ్మలేకపోయాను.

అన్నిటికంటే ఆశ్చర్యమేమిటంటే అమర్‌తో సంబంధం కలిగిన వ్యక్తి మధ్య వయస్కుడు. ఒక యూనివర్శిటీలో ప్రొఫెసర్.



యువతకు మంచి మార్గం చూపించాల్సిన బాధ్యతాయుతమైన పొజిషన్లో వున్న వ్యక్తి ఒక పాతికేళ్ల నవయువకుడిని ఇలా తప్పుదోవ ఎలా పట్టించగలడు? చిత్రంగా అమర్ ఈ విషయాన్ని ఇంట్లో దాచలేదు. పైగా ఆ ప్రొఫెసర్‌ని ప్రేమిస్తున్నానంటూ బాహాటంగా చాటేశాడట.

ఒక్కగానొక్క కొడుకు ఇలా తయారయ్యాడేంటా అని అమర్‌వాళ్ల నాన్నగారు కృంగిపోయారట. ప్రతిరోజూ ఈ విషయమై గొడవలు మొదలయ్యాయి. చివరకు తల్లిదండ్రుల పోరు పడలేక అమర్ పెళ్లికి సిద్ధం అయ్యాడట.

అదీ కథ!

నేను విన్నదంతా విని మరింత అయోమయంలో పడిపోయాను. నాకు చాలాసేపటివరకూ ఏం చేయాలో పాలుపోలేదు. అతి కష్టమ్మీద నన్ను నేను సంబాళించుకున్నాను. ఆ తరువాత నిదానంగా కూర్చుని ఆలోచించాను.

ఏం చేయాలి?

ఇలాంటి వింత పరిస్థితిలో ఎవ్వరైనా ఏం చేస్తారు?

ఇంతకంటే అమర్ మరో స్త్రీతో ఇన్‌వాల్వ్ అయి వున్నాడన్నా కాస్త సంతోషించేదాన్నేమో!

ఎనీవే బాగా ఆలోచించగా నాకు ఒక్కటే మార్గం తోచింది.

ఆ ప్రొఫెసర్ వద్దకెళ్లి నా భర్తను నాకు ఇచ్చెయ్యమని బ్రతిమాలుకోడం. అంతకంటే వేరే దారిలేదు. ఒక ప్రొఫెసర్ అయ్యుండి ఇంత వయసు వచ్చినా ఆ వ్యక్తి ఇలా చేయడం భావ్యమేనా అని నిలదీస్తాను.

అంతే!

ఆ తరువాత ఇంకేమీ ఆలోచించలేదు. నా ధైర్యం నన్ను విడిచి పెట్టకముందే ఒకలాంటి తెగింపుతో బయలుదేరాను. తీరా కాలింగ్ బెల్ మోగిస్తుంటే మొండిధైర్యం, తెగువ అన్నీ నన్ను వదిలివెళ్తున్నట్లు అన్పించసాగింది. చేతులు వణుకుతున్నాయి. అక్కడ్నుంచి పారిపోవాలనే కోరికను బలవంతంగా అణచిపెడ్తూ నిలుచున్నాను.

మరి కొద్దిక్షణాల్లో తలుపు తెరుచుకుంది. పనమ్మాయి కాబోలు నాకేసి ప్రశ్నార్థకంగా చూసింది.

''ప్రొఫెసర్‌గారున్నారా?'' అడిగాను.

''స్నానం చేస్తున్నారు'' ఆమె నాకేసి ఆసక్తిగా చూస్తూ ''లోనికి రండి''.

నేను లోపలికెళ్లాను.

''ఎవరొచ్చారని చెప్పను?''

ఆ ప్రశ్న విని ఒక్కక్షణం ఏం చెప్పాలో తోచక కలవరపడ్డాను.

''శిల్ప'' ఎండిపోయిన పెదాలను తడుపుకుంటూ చెప్పాను.

ఆమె వెళ్లిపోయింది.

నేను నెర్వస్‌గా సోఫాలో కూర్చున్నాను. ఎక్కడాలేని భయాలు, సంశయాలూ ఇప్పుడు మొదలయ్యాయి.

ప్రొఫెసర్ ఎలాంటివాడో?

నన్ను చూసి ఎలా రియాక్ట్ అవుతాడో?

అసలు నేనెందుకొచ్చాను? అతనేమయినా అమర్యాదగా మాట్లాడితే?

అనీజీగా కదిలి టేబుల్‌మీద పడివున్న పుస్తకాలను తిరగేస్తున్నాను.

హఠాత్తుగా ఒక అందమైన పుస్తకం నన్ను ఆకర్షించింది. పుస్తకం పేరు అమరప్రేమ. రచయిత పేరు వుండాల్సిన చోట ప్రొఫెసర్ పేరుంది. ప్రొఫెసర్ మంచి కవి అని అత్తయ్య చెప్పడం గుర్తొచ్చింది. ఉత్సుకతతో పుస్తకం అందుకుని తెరిచాను. చూడబోతే కవితల సంకలనంలా వుంది.

మొదటి పేజీలో 'ప్రియమైన అమర్‌కి అంకితం' అని రాసి వుంది. అప్పుడర్థమయింది. పుస్తకానికి అమరప్రేమ అని పేరు ఎందుకుందో? సాలోచనగా చదవడం ప్రారంభించాను.

అబ్బ! ఏమి కవిత్వం. ఎంత భావుకత.

ఒక్కో కవిత కవి మనస్సులోంచి అంతరంతరాల్లోంచి పుట్టుకొచ్చినట్లుంది. అన్ని కవితల సారాంశం ఒక్కటే. 'అమర్'

ఆ కవితలు చదువుతున్నకొద్దీ ప్రొఫెసర్‌గారి గురించి నేను ఏర్పర్చుకున్న ధోరణి మారిపోసాగింది. ఒక కొత్త రూపం సంతరించుకోసాగింది.

ప్రపంచాన్ని ధిక్కరిస్తూ తనదైన బాణీలో సాగిపోవాలనే తపన, సమాజపు కట్టుబాట్లను తెంచుకుని బైటికి రావాలనే ప్రయాస, అవమానం పాలు చేస్తున్న లోకానికి ఎదురీదుతున్న ఈ వ్యక్తికి ఈ స్వేచ్ఛాజీవికి నా మదిలో వున్న ప్రొఫెసర్ ఇమేజ్‌కి బొత్తిగా పోలికలేదు.

ఆ కవితల సంపుటి ఆత్మకథలా తోస్తోంది.

''హలో'' గొంతు విని ఉలిక్కిపడ్డాను.

తలెత్తి చూస్తే ఎదురుగా సాదీసీదాగా అవుపిస్తున్న వ్యక్తి నిలబడి వున్నాడు. మామూలు ఎత్తు, మనిషి శరీరచ్ఛాయ ఫారినర్స్‌లా వుంది. తల మీద జుత్తు, గడ్డం మీసాలు అన్నీ తెలుపు నలుపు వెంట్రుకలు కలిసి వున్నాయి. తెల్లని తెలుపులో మెరుస్తున్న లాల్చీ పైజమా మనిషి మొహంలో ప్రశాంతత, ముఖ్యంగా ఆ కళ్లు.

నిర్మలంగా, స్వచ్ఛంగా వున్నాయి.

నేను ఊహించినదానికి పూర్తి భిన్నంగా వున్నాడు.

''మీరేనా మిసెస్ శిల్పా?''

నేను తలూపాను.

పలకరింపుగా అతని పెదవులపై చిర్నవ్వు మెరిసింది. ఆ చిన్న నవ్వు అతని మొహాన్ని పూర్తిగా మార్చేసింది. కళ్లల్లో విచిత్రమైన మెరుపు. ఏదో తన్మయత్వంలో మునిగి వున్నట్లుగా వుందా భావం. వచ్చి నా ముందర వున్న సోఫాలో కూర్చున్నాడు. మనిషి నడకలో గమ్మత్తయిన వగలు వుంది.

''అమర్ ఎలా వున్నాడు?'' ఎడమ చేత్తో నుదుటిపై పడుతున్న జుత్తును వెనక్కి తోస్తూ అడిగాడు.

నేను ఉలిక్కిపడ్డాను. నేను అమర్ భార్యనని చెప్పలేదే? ఎలా తెల్సింది?

''అమర్ పెళ్లి కార్డు పంపించాడు'' చురుగ్గా నా ఆలోచనని పసిగడ్తూ అన్నాడు.

ఇంతలో పనమ్మాయి టీ పట్టుకొచ్చింది. నేను మౌనంగా టీ సిప్ చేయడం మొదలుపెట్టాను. ఇప్పుడేం చేయాలి? ఏమనాలి? ఎలా మొదలుపెట్టాలి?

అతనే మాట్లాడ్డం మొదలుపెట్టాడు. నన్ను ఎప్పట్నుంచో ఎరిగున్నట్లుగా!

ఆ మాటలూ ఈ మాటలూ అయ్యాక క్రమంగా అమర్ గురించి. అమర్‌ని ఎక్కడ కలిసిందీ, అమర్ వాళ్ల నాన్నగారు తనని ఎలా బెదిరించిందీ, అమర్ తనని ఎలా అర్థం చేసుకుంది వగైరా వగైరా.

క్లుప్తంగా అదో ప్రేమకథలా తోచింది.

నాకిదంతా ఎందుకు చెబుతున్నాడో అంతుపట్టలేదు. నా మొహంలో కనిపించిన అయోమయాన్ని పసిగట్టి కాబోలు.

''ఏమయింది?'' అన్నాడు ప్రొఫెసర్.

''నేనిదంతా వింటానికి రాలేదు'' అన్నాను.

''మరి?'' కన్‌ఫ్యూజ్ అయినట్లున్నాడు.

''నేను...నేను'' తడబడ్డాను.

''నా భర్తను నాకు తిరిగి ఇవ్వమని అర్థించడానికి వచ్చాను'' తక్కున అనేసాను. కానీ నా మాటలు నాకే పేలవంగా వినిపించాయి.

అతను షాక్ కొట్టినట్టు ఒక్కక్షణం నాకేసి చూస్తుండిపోయాడు. ఆ మొహంలో సడెన్‌గా గాంభీర్యం వచ్చేసింది.

''కానీ శిల్పా! అమర్ ఇప్పుడిక్కడికి రావడం మానేసాడు'' అన్నాడోసారి ఊపిరి వదిలి.

అది మామూలుగా వదిలిన ఊపిరికాదు. మనసులోంచి తన్నుకువచ్చిన నిట్టూర్పు.

ఆ ఒక్క నిట్టూర్పులో నాకెన్నో విషయాలు అర్థమయ్యాయి.

ఆ నిట్టూర్పులో అచ్చు ప్రియుడి విరహంలో వేగుతున్న ప్రియురాలి తపన గోచరించింది. నా ప్రశ్నకి సమాధానం దొరికినట్లయింది.

అది పిచ్చి కావచ్చు.

అది వెర్రి కావచ్చు.

అది ఉన్మాదం కావచ్చు.

అది పెర్వర్షన్ కావచ్చు.


ఏదైతేనేం? అందులో నిజాయితీ వుంది. స్వచ్ఛమైన భావన వుంది. అతనికీ అమర్‌కీ కేవలం శారీరక సంబంధం మాత్రమే కాదు, మానసిక బంధం కూడా వుంది.

తను అమితంగా ప్రేమించే వ్యక్తి దూరమైతే కలిగే మానసిక క్షోభని అతను ప్రస్తుతం అనుభవిస్తున్నాడు.

అతను మరో పురుషుడు కాదు. వాళ్లిద్దరి మధ్యకి వచ్చిన నేను ఆ 'మరో స్త్రీ'ని. హఠాత్తుగా నాకీ విషయం తట్టింది. ఈ మరో స్త్రీ అనే బిరుదు నాకు పెద్దగా రుచించలేదు.

ప్రొఫెసర్ నుంచి సెలవు తీసుకుంటూ ఈ బిరుదుని వీలైనంత త్వరగా నానుంచి దూరం చేయాలని నిశ్చయించుకున్నాను.

★



## నూరో చిత్రం!

ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు నిర్మించబోయే వందవ చిత్రం గురించిన చర్చ గత కొంత కాలంగా వినిపిస్తూనే వుంది. ఇందులో చిరంజీవి-వెంకటేష్ హీరోలుగా నటిస్తారని ఒక వార్త అయితే, తన వందో సినిమాని ఆర్ట్ ఫిలింగా రూపొందించాలని, ఇందుకు బి.నర్సింగరావు దర్శకత్వంలో ఓ సినిమా తీయవచ్చునని ఒక వార్త. అదలా వుంటుండగానే రామానాయుడు వందవ చిత్రంలో రజనీకాంత్ హీరోగా నటించవచ్చునే సంగతి తాజాగా బయటికొచ్చింది. 'అరుణాచలం' సినిమా తరువాత రజనీకాంత్ ఇంతవరకూ మరో చిత్రంలో నటించలేదు. ఆ సినిమా ఏమైవుంటుందా? ఎవరిదై వుంటుందా? అని అనుకుంటున్న సమయంలో సురేష్ ప్రొడక్షన్స్ నూరో చిత్రం హీరో రజనీకాంత్ అని వినిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

- జె.